# అందమైన పొరుగు

పార్వతి అలసిపోయింది. దాన్లో ఆశ్చర్యంలేదు అది మామూలే! కాని మామూలుగాని ఒక రకం స్తబ్దత ఆవరించింది పార్వతి మనస్సుని కృష్ణమూర్తికి పరస్తుతి ఎక్కువయినకొద్దీ పార్వతికి ఆత్మనింద ఎక్కువవుతుంది. ఈ మధ్య ఇదే జరుగుతోంది భర్తనీ పిల్లలనీ అపరిమితంగా ప్రేమించింది. "దాని ఫలితమేనా ఇది?..." అనుకుంటూ దారికడ్డుగా పడివున్న క్రికెట్ బ్యాటుక్క, సైకిలు, కాగితాలు, పెన్సిళ్ళు, పాత గుడ్డలు—అన్నీ ఒక టొకటే తీసి వాటి వాటి స్థానంలో పెట్టింది పార్వతి. కాస్సేపు అమ్మదగ్గిర కూర్చుని రావాలి అనుకుంది. "యీ యింట్లో వాళ్ళు నన్నేం అనుకుంటున్నారో —అతి శ్రద్ధగా వండిపెట్టేసి తమ సదుపాయాలు చూసే మర మనిషి అనుకుంటున్నారేమో" అని వింతపడింది.

వీధి తలుపు గడియవేసి తాళం వేసింది. మెట్లుదిగి గేటు దాటింది వీధిలోకి వస్తూనే పక్కింటికేసి ఒకసారి చూసింది అలా ఎప్పుడు చూసినా పార్వతి మనసు కించపడుతుంది. చక్కని చిన్నతోట పెంచింది పక్కింటి సుభద్రగారు. బారులు తీరిన పూలమొక్కలు చక్కగా పూసి ఎంతో అందంగా ఉన్నాయి. ఎప్పుడూ కృష్ణమూర్తి అంటూ ఉం

టాడు. "ఆడదే అయినా తోట చూడు ఎంత అందంగా ఉంచు తుందో" అని శని ఆదివారాలలో తోటలో ఎండిన పూవులు కోసి పారేసే సుభద్రగారి నేర్పు పార్వతికి తెలియనిది కాదు. వారం పొడుగునా తోటవాడు పనిచేస్తాడు అని కృష్ణ మూర్తికి చెప్పాలనుకుని ఊరుకుంది పార్వతి.

పార్వతి కా తోటపని బాధేలేదు. పెరట్లో పువ్వుల మొక్కనేది తలెత్తదు. ఒకవేళ ఏదైనా మొక్క వచ్చినా దాని వేళ్ళు ఎలా ఉన్నాయో పీకి చూసి తీరతాడు నానిగాడు రోజూ వాడి కదేపని. పక్కింటి సుభద్రగారికి పెళ్ళి అయిందో లేదో తెలియదు. ఒంటరిగానే ఉంటుంది ఏదీ ఉద్యోగం చేస్తు న్నట్టుకూడా లేదు. కాని బయటికి వెళ్ళి వస్తూనే ఉంటుంది.

పక్కింటి తోటకేసి చూసి మనసులోనే ఉసూరుమన్నా పార్వతి బస్సుస్టాండు దగ్గిరికి వచ్చేసరికి మామూలు స్థితికి వచ్చింది. బస్సుకోసం సుభద్రగారు కూడా నిలబడివుంది. అక్కడ అప్సరస్సులా నిలబడిన సుభద్రగారిని చూసి "కొంచెం మంచి చీర కట్టుకుని ఉండవలసి ది నేను కూడా" అనుకుంది పార్వతి.

"ఏమిటీ మీరూ బయలుదేరారు?" ఆశ్చర్యంగా అడి గింది సుభద్రగారు.

"అమ్మ ఇంటికని" నెమ్మదిగా అంది పార్వతి.

"నేనలా బాలమందిర్‌లో పిల్లల్ని చూసివద్దాం అని బయలుదేరాను. అబ్బ! ఎంత ముద్దొస్తుంటారండీ" అంది సుభద్రగారు.

"పిల్లలంటే అంతఇష్టమైతే తన కుటుంబమే విస్తరించు కోవచ్చుగా" అనుకుంది పార్వతి.

"మిమ్మల్ని చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇంట్లో క్షణం విశ్రాంతి ఉండదనుకుంటాను" సానుభూతి ప్రకటించింది.

"ఉండకేం ఉంటూనే ఉంటుంది. అయినా విశ్రాంతి ఏం చేసుకుంటాను!" అంది పార్వతి.

"అదేమిటి సంఘసేవ చేయవచ్చుగా" నవ్వుతూ అంది సుభద్రగారు.

పార్వతి ఆ క్షణంలో తన భర్తని పిల్లలని జ్ఞాపకం తెచ్చుకుంది. ఒక్క క్షణం తను లేకపోతే ఇల్లు తల్లకిందులై పోతుంది. ఎక్కడ పని అక్కడే ఆగిపోతుంది. అంతేకాదు. అందరూ తనమీద విరుచుకుపడతారు! తనకి తెలియకుండానే పార్వతి నిట్టూర్చింది.

సుభద్రగారు మాట కలపకపోతే అలాగే తన ఆలోచనలలో పడిపోయేది పార్వతి.

"రేపురాత్రి మీరు, మీ ఆయనా మా ఇంటికి భోజనానికి రావాలి" అంది సుభద్రగారు.

"ఏమిటి విశేషం?" నవ్వుతూ అడిగింది పార్వతి.

"ఏదైనా విశేషం లేకుంటే రారా? సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేద్దాం" అంది సుభద్రగారు.

"చెప్తాను" అంది పార్వతి.

"చెప్పడంకాదు. రావడమే అదిగో వచ్చేది నా బస్సే" అంటూ బస్సుకోసం ముందుకి సాగింది సుభద్రగారు. ఆవిడకి అందరూ దారి విడిచారు. సుఖంగా బస్సు ఎక్కేసింది.

పార్వతి కాస్సేపు తల్లితో కబుర్లు చెప్పి బాబిని స్కూలు నుంచి తీసుకుని ఇంటికి వచ్చేసింది. ఆ రాత్రి భోజనాలు అయిపోయాయి. కృష్ణమూర్తి సిగరెట్ కాలుస్తూ పేపరు చూసుకుంటున్నాడు మధ్యలో పార్వతి తమలపాకులు చిలకలు చుట్టి నోటికి అందిస్తోంది.

"రేపు రాత్రి మనం ఎక్కడికి వెడుతున్నామో ఊహించు చూద్దాం" అంది కృష్ణమూర్తితో.

"వెడుతున్నామా? ఎక్కడికి? నాకు క్లబ్బులో బ్రిడ్జి ఉంది."

"అయ్యో అలా అంటే ఎలా? వస్తామని చెప్పానే" చిన్నబుచ్చుకుంటూ అంది పార్వతి.

"ఏమిటీ గొడవ? గత పదేళ్ళలో ఒక్క రోజు కూడా నువ్వు అయ్యో అనడం వినలేదు నేను" అన్నాడు కృష్ణమూర్తి.

"టైము లేకపోయింది! పిల్లల్ని కనడానికి పెంచడానికి సరిపోయింది. అంచేత నీ క్లబ్బు కార్యక్రమాల వివరాలు తెలుసుకో లేకపోయాను!" వ్యంగ్యంగా అంది పార్వతి. సిగరెట్ క్రిందపారేసి భార్యకేసి వింతగా చూశాడు కృష్ణమూర్తి. "ఇప్పుడేమైంది? ఇద్దరూ స్కూల్‌కి వెళ్ళిపోతున్నారుగా?" అనునయంగా అన్నాడు.

"బాబిగాడు సరిగ్గా మూడు గంటలు ఉంటాడు స్కూల్లో. మూడున్నర అయేసరికి నానిగాడు వస్తాడు. వాళ్ళ గోల భరించడానికి ఒక రోజుకి వారం రోజుల శక్తి కావాలి" అంది పార్వతి.

కృష్ణమూర్తి సన్నగా నవ్వుకున్నాడు. నానిగాడు నా పోలిక. వాడి ఘనత వినడానికి ప్రేక్షకులు కావాలి. నువ్వు వాడి ముఖ్య అతిథివి" అన్నాడు.

"పోనీలే ఎక్కడికి వెళ్ళాలని...చెప్పు" అడిగాడు.

"పక్కింటి సుభద్రగారు భోజనానికి పిలిచారు" సగం వుత్సాహం చచ్చిపోగా అంది పార్వతి.

"ఆ—నైస్‌గాల్! అన్నాడు కృష్ణమూర్తి.

"గాల్! నా ముఖం. నిరభ్యంతరంగా నా వయస్సు వుంటుంది ఆ పిల్లగారికి!" అంది ఘాటుగా.

"పాపం ఒకర్తేకే ఏం తోచడం లేదు కాబోలు. అలాగే వెడదాం" అన్నాడు పేపరులో తలదూర్చేస్తూ.

దగ్గరలో ఏం దొరికితే అది ఆ క్షణంలో కృష్ణమూర్తి మీదికి విసరాలన్నంత కోపంవచ్చింది పార్వతికి. గట్టిగా అరవాలనిపించింది. కాని అవేం చెయ్యలేదు. "అంత తోచకుండా లేదులే. కాలక్షేపానికి సంఘసేవలాంటిది చేస్తూ ఉంటుందట. మరి నీ క్లబ్బు మాట?" అడిగింది పార్వతి. "కబురంపుతానులే. ఇంకో పార్ట్నర్‌ని చూసుకుంటాడు" అన్నాడు కృష్ణమూర్తి. "ఈ రోజు బస్సులో కనిపించింది" అన్నాడు. "రేపురాత్రికి కొత్తచీర కొని వుంటుంది!" హేళనగా అంది పార్వతి. "మంచి చలాకీ అయిన వ్యక్తి. ఎంత జాగ్రత్తగా డ్రస్ చేసుకుంటుందో చూశావా?" సీరియస్‌గానే అన్నాడు కృష్ణమూర్తి. దాంతో వచ్చింది అసలు చిక్కు.

ఎదుటి స్త్రీని అంత పొగిడితే ఎంత భార్య అయితే మాత్రం ఎంతకాలం భరిస్తుంది? విందుకు వెళ్ళినప్పుడు ఎలాగైనా సరే సుభద్రగారిని తల దన్నాలని నిశ్చయించుకుంది పార్వతి.

రాత్రి పిల్లలకి ఇట్టే నిద్ర వచ్చేసింది - పార్వతి లాలి పాటతో.

పార్వతి మెదడు వరివరి విధాల ఆలోచనలు చేస్తోంది తనూ ఏమైనా చేస్తే తప్పించి లాభంలేదు అనుకుంది. పెట్లో డబ్బుంది. కాని దాని కెంతో అవసరం వుంది. కుర్రాళ్ళ గుడ్డలు కుట్టించాలి. నానిగాడికి బూట్లు కొనాలి. మధ్యలో పుట్టిన రోజులు వస్తాయి డాక్టరు అవసరాలు వస్తాయి... కాని పార్వతి చెవుల్లో కృష్ణమూర్తి మాటలే మార్మోగుతున్నాయి. "ఎంత జాగ్రత్తగా డ్రస్సు చేసుకుంటుందో చూశావా?!" అన్న అతని మాట ములుకులా పార్వతి హృదయాన్ని దొలిచింది "ఖర్చులు ఉండనీ. వాటి గొడవెందుకు?" అని నిశ్చయించుకుంది. "తెల్లవారనీ" అనుకుని తృప్తిగా నిద్రపోయింది.

మరునాటి ఉదయం పెందరాడే లేచింది పార్వతి. చాలా సింపుల్ గా చేసి అయిందనిపించింది వంట.

"ఏమిటీ ఒకటే హడావిడిగా ఉన్నావు?" వేళాకోళం చేస్తూ భార్య బుగ్గమీద చిటికె వేశాడు కృష్ణమూర్తి.

"నేను బజారుకి వెడుతున్నాను" క్లుప్తంగా సమాధానం చెప్పింది పార్వతి.

భర్త ఆఫీసుకి, పిల్లలు స్కూల్ కి వెళ్ళారు. పదిగంటలకల్లా వీధితలుపు తాళంవేసింది పార్వతి. తిన్నగా "వర్నాలి"కి

వెళ్ళింది. చక్కని జరీ చీర కొంది. ఔనుకి బస్సు ఎక్కింది. చక్కని సవరం కొంది. ఎన్నాళ్ళనుంచో వుందా కోరిక— పొడుగ్గా వాలుజడ వేసుకోవాలని. కాని ధైర్యం చేయలేక పోయింది. కాని యీ రోజుకి-కావలసిన తెగింపు వచ్చింది.

సాయంత్రం పిల్లలు ఇంటికి వచ్చాక వాళ్ళకి భోజనాలు సిద్ధంచేసింది. నూకాలుని వాళ్ళకి సాయం వుండమంది. నూకాలు వుట్టినే కూర్చోడు. చక్కగా మల్లెలు, దవనం కలిపి దండ కట్టింది పార్వతికోసం. అందంగా తలదువ్వి వాలుజడ వేసుకుని మాల పెట్టుకుంది. కొత్త చీర కట్టి తగిన పొట్టిచేతుల రవికె తొడిగింది. కళ్ళకు కాటుక దిద్దింది. అందంగా తయారై కృష్ణమూర్తి కోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

తండ్రి కారు చప్పుడు కాగానే వీధిలోకి పరిగెత్తారు నానిగాడూ బాబిగాడూ. "నాన్నారూ, అమ్మ కొత్తమ్మ" అన్నాడు బాబిగాడు "ఔను నానా బ్యూటిఫుల్ గా వుంది" అన్నాడు నానిగాడు. "అలాగా చూద్దాం" అంటూ లోపలికి వచ్చాడు కృష్ణమూర్తి. కుర్రవాళ్ళు ఆటలో పడిపోయారు. పార్వతి పడగ్గదిలో అద్దంముందు కూర్చుని చూసుకుంటోంది. "పార్వతీ" అంటూ లోపలికి అడుగుపెట్టి అలాగే నిలబడి పోయాడు కృష్ణమూర్తి. పోకిరి కుర్రవాడిలాగా ఒక ఈల వేసి భార్య దగ్గరికి వచ్చాడు.

పార్వతి ఎంత అందంగా తయారైందో మనసులో అంత బాధపడుతోంది. కృష్ణమూర్తి ఈ పొగడ్తతో కళ్ళనీళ్ళపర్యంతం ఆయింది. నీరు కమ్మిన కళ్ళతో కృష్ణమూర్తి కేసి చూసింది భార్యని చేతులలోకి తీసుకుని గుండెల కదుము

కున్నాడు ఎప్పుడూ నిశ్చలంగా నిజాన్ని చాటిచెప్పే ఆమె కళ్ళలోకి సమాధానం కోసమో అన్నట్టు చూశాడు.

దృష్టి పక్కకి మళ్ళించుకుంటూ అంది పార్వతి "నువ్వు అస్తమానూ అంటూనే వున్నావు. ఎంత అందంగా డ్రెస్ చేసుకుందో అంటూ... నే భరించలేకపోయాను బాబోయ్... ఈ వేళ ఒళ్ళు తెలియలేదు..." నవ్వుకుంటూ నిజం చెప్పేసింది పార్వతి.

"పార్వతీ నువ్వెంత అందంగా వున్నావోయ్" పెదవులపై మదువుగా ముద్దుపెట్టుకున్నాడు.

"వున్న డబ్బంతా ఖర్చు చేశాను" అంది పార్వతి నీరసంగా.

"మంచిపని చేశావు. నేనూ కొంత ఖర్చుచేసి-యీ చీరకి కాదు-నీకు తగ్గ ఓ నెక్లెస్ తెచ్చాను" జేబులోంచి వల్చని పెట్టె తీశాడు కృష్ణమూర్తి.

"ఎందుకలా చేశావు?" అంటూనే అతని గుండెల్లో తలదాచుకుంది పార్వతి.

"అందులో స్వార్థం లేకపోలేదు ... అయితే ఒక సంగతి..." ఆగాడు కృష్ణమూర్తి.

"ఏమిటి?" ఆత్రంగా అతని ముఖంలోకి చూసింది పార్వతి.

"యీ రాత్రికి సుభద్రగారిని మరుగున వదేయడం అయితే. నీ చిన్న జడ పువ్వు వేసేసుకుంటావా?"

"పెద్దదాన ఆనవాళ్ళకి అందం బాగుగా" వస్తున్న నవ్వు ఆపుకొంటూ అంది పార్వతి.

"గొర్రె తోకలా వున్నా నాకు నీ పొట్టిజడే యిష్టం"

భార్య మెడలో తెచ్చిన నెక్లెస్ పెడుతూ తెల్లని కంఠాన్ని ముద్దు పెట్టుకున్నాడు కృష్ణమూర్తి. "నా కళ్ళకి నువ్వెలా వున్నా అందంగా వుంటావు పార్వతీ యీ సంగతి ఎప్పుడేనా చెప్పానా?" అడిగాడు.

"చెప్తే ఇంత గొడవే వచ్చేది కాదు" అంది కృష్ణ మూర్తి కళ్ళలోకి చూస్తూ.

"అదీ మన మంచికే వచ్చింది" భార్యని యివతలికి నడిపించుతూ అన్నాడు కృష్ణమూర్తి.

అప్పుడే బాగా చీకటిపడింది.

పోయిన ఆత్మవిశ్వాసం తిరిగి రావడంతో హుందాగా భర్త వెంట పక్కింటికి నడిచింది పార్వతి.

—o—